లక్ష్మీనరసింహస్వామికి నిత్య తిరుకల్యాణం

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శనివారం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవసేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం అరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.19,79,989 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చైర్మన్ పూజలు

రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటేశం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ గంగాధర్

మల్యాల కేజీబీవీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్

బొమ్మలరామారం, జూలై 27 : ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్ ఆదేశించారు. మండలంలోని నాగినేనిపల్లి ప్రభుత్వ పాఠశాల, మల్యాల గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి

ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ, జూలై 27: రీజినల్ రింగ్ రోడ్డు, గౌరెల్లి-భద్రాచలం రోడ్డు నిర్మాణాల్లో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం బహిరంగ మార్కెట్ విలువకు మూడు రెట్ల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, గౌరెల్లి- భద్రాచలం రోడ్డుకు భూములు కోల్పోతున్న ఒకే గ్రామానికి చెందిన రైతులను విడదీసి వారితో మాట్లాడుతూ వారిని మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. అందరికీ సమానమైన పరిహారం అందించాలని కోరారు. అనంతరం చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, నాయకులు మెరుగు వెంకటేశం, శ్రీశైలంరెడ్డి, రాంచంద్రం, కొండె కిష్టయ్య, వాకిటి వెంకట్‌రెడ్డి, బుగ్గ చంద్రమౌళి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ


బాధితుడికి చెక్కు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రాజు

తుర్కపల్లి, జూలై 27 : మండలంలోని పెద్దతండా గ్రామానికి చెందిన ధారావత్ హరినాయక్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.24వేల చెక్కును శనివారం బీఆర్ఎస్ మండల నాయకుడు అన్నారం రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గిద్దె కర్ణాకర్, మోహన్‌బాబు, కోఆప్షన్ మాజీ సభ్యులు రహమత్‌షరీఫ్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడాసామగ్రి అందజేత

క్రీడా సామాగ్రి అందిస్తున్న మిషన్ కోఆర్డినేటర్ హర్ష

చౌటుప్పల్, జూలై 27 : జిల్లా మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం క్రీడా సామిగ్రిని అందించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ హర్ష మాట్లాడుతూ విద్యార్థినులు చదువులో రాణిస్తూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి కంది భవాని, భార్గవి, సుమలత, పుష్ప పాల్గొన్నారు.

సైకిల్‌పై పోలీసుల గస్తీ

యాదగిరిగుట్టలో సైకిల్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

యాదగిరిగుట్ట, జూలై27: సరికొత్తగా సైకిల్ పెట్రోలింగ్‌ను యాదగిరిగుట్ట పోలీసులు శనివారం ప్రారంభించారు. పట్టణంలో సైకిల్‌పై పోలీసులు గస్తీ తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుళ్లు విజయ, కల్యాణి సైకిల్‌పై పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహించి స్థానికులతో మాట్లాడారు. డ్రగ్స్, సైబర్‌నేరా లు, దొంగతనాలపై అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్ పనులు చేపట్టాలి

● కలెక్టర్ హనుమంతు కె. జెండగే

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూలై 27 : అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్ పనులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె. జెండగే అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కరుణాకర్‌తో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల అప్ గ్రేడెషన్ కోసం 200 కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణం, 50 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి, 7 కేంద్రాల్లో మరమ్మతు పనులు చేసేందుకు రూ.98.13లక్షలు విడుదలైనట్లు చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీడీపీఓలు జ్యోత్స్న, చంద్రకళ, శైలజ, స్వరాజ్యం, రమ, సమీర పాల్గొన్నారు.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం : ఏపీఓ

ఆత్మకూరు(ఎం),జూలై 27 : వనమహోత్సవంలో నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు ఏపీఓ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 65 వేల మొక్కలను సిద్ధం చేశామని, మొక్కలు నాటేందుకు 50వేల గుంతలు తీసి సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో 35వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. మండలంలో 80వేల ఎకరాల్లో పండ్లతోటల పెంపకం కోసం మామిడి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, కొబ్బరి, మునగ మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అందుకోసం చిన్న, సన్నకారు రైతులకు చెందిన 60ఎకరాల భూమిని సైతం గుర్తించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

యాదగిరిగుట్ట, జూలై 27: మండలంలోని చిన్న కందుకూరు వద్ద శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైనట్లు యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. భువనగిరి మండలం బాలంపల్లి గ్రామానికి చెందిన కాశపాక రంగయ్య తన బావ గ్రామమైన చిన్నకందుకూరుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వెళ్తుండగా చిన్నకందుకూరు స్టేజీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వైకుంఠ రథం ప్రారంభం

భువనగిరి అర్బన్, జూలై 27: పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవితా నర్సింహచారి కూతురు భావన జ్ఞాపకార్థం రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన ఉచిత వైకుంఠ రథాన్ని శనివారం బీజేపీ భువనగిరి మాజీ అధ్యక్షుడు పీవీ.శ్యామ్‌సుందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, నీల రమేశ్, బర్రె జహంగీర్, బోయిని నర్సింహ, మాణిక్యంరెడ్డి పాల్గొన్నారు.

నెమలిని అటవీశాఖ అధికారికి అప్పగిస్తున్న అంజద్

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత

భువనగిరి అర్బన్, జూలై 27: పట్టణంలోని కిసాన్‌నగర్‌లో గల పార్కులోకి శనివారం నెమలి రాగా దానిని కోతులు వెంబడించి గాయపర్చాయి. గమనించిన కాలనీకి చెందిన ఎండీ.అంజద్ నెమలిని పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించాడు.

బీసీ కుల గణన చేపట్టాలని నిరసన

రాజాపేట, జూలై 27 : బీసీ కుల గణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో బీసీ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మోత్కుపల్లి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మున్సిపల్ ఉద్యోగి ఆత్మహత్య

యాదగిరిగుట్ట, జూలై 27: కుటుంబ కలహాలతో యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ఉద్యోగి దూడల నర్సింహగౌడ్(54) శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన నర్సింహగౌడ్ ఇంట్లో నిత్యం కుటుంబ కలహాలు చోటు చేసుకుంటుండడంతో జీవితంపై విరక్తి చెంది తెల్లవారుజామున ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్‌లో ఇనుప రాడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చేనేత వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

● వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్

శిక్షణలో పాల్గొనే వారికి సామగ్రి అందిస్తున్న అరుణ్‌కుమార్

భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, జూలై 27: ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత కార్మికులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవాలని రాష్ట్ర వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. డీఎస్ఆర్ వ్యూస్, భారత ప్రభుత్వ జౌళీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సమర్థ గ్రూప్ పథకం కింద మండల కేంద్రంలో 30 మంది కార్మికులకు 45 రోజులపాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో పాల్గొనే కార్మికులకు రోజుకు రూ.300 స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ వ్యూస్ అధినేత దోర్నాల శేషగిరి, అధికారులు పవన్‌కుమార్, ట్రైనర్ భోగ బాలయ్య, గోశిక భానుప్రకాశ్, కార్మికులు పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ప్రభుత్వ విప్‌కు వినతి

ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

ఆలేరురూరల్, జూలై 27 : ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేసే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పసుపునూరి వీరేశం, సభ్యులు రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేశ్, మొరిగాడి చంద్రశేఖర్, ఇక్కిరి సహదేవ్, కెమిడి ఉప్పలయ్య, సుదర్శన్, రవి, ఎండీ సలీమ్, తుంగ కుమార్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శికి సన్మానం


పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తుర్కపల్లి, జూలై 27 : మండలంలోని చిన్నలక్ష్మాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ బదిలీపై వెళ్తుండడంతో శనివారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమటిరెడ్డి సంతోషభాస్కర్‌రెడ్డితో పాటు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. 12 సంవత్సరాలుగా సతీశ్‌కుమార్ గ్రామాభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ స్వప్నమల్లేశ్, కొమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

● పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్తిరెడ్డి

కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సత్తిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూలై 27 : గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం కార్యవర్గం కృషి చేయాలని పీఏసీఎస్ మాజీచైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి సూచించారు. మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు దంతూరి వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మెడబోయిన శివానంద్, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి నర్సింహగౌడ్, డైరెక్టర్ దంతూరి ఈశ్వరయ్యగౌడ్‌ను శనివారం శాలువాలతో ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నెపు రాములు, గౌడ సంఘం పెద్దలు డొంకెన ప్రభాకర్‌గౌడ్, నకిరేకంటి హరిబాబు, పాండురంగంగౌడ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

కొలనుపాకలో మురుగు కాల్వలేక ఇబ్బందులు

మురుగు కాల్వను చూపుతున్న గ్రామస్తులు

ఆలేరురూరల్, జూలై 27 : మండలంలోని కొలనుపాకలోని 2వ వార్డులో మురుగు కాల్వలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు వాపోయారు. కాల్వ, సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ శనివారం కాలనీలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మురుగు నీరు ఇండ్లమధ్యే నిల్వ ఉండి దోమల బెడదతో తాము అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు. వెంటనే అధికారులు సీసీరోడ్డు, మురుగు కాల్వను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఉమర్, రఘు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేల కొనుగోలుపైనే శ్రద్ధ

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

యాదగిరిగుట్ట, జూలై27: కాంగ్రెస్ పార్టీకి ఇతర పార్టీల ఎమ్మెల్యేల కొనుగోలుపై ఉన్న శ్రద్ధ ప్రజలకిచ్చిన హామీల అమలుపై లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ విమర్శించారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని మయూరి హోటల్లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ కాలంలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న ప్రభుత్వం కాంగ్రెస్‌దే అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, నాయకులు జెల్లా భానుచందర్, ఉపాధ్యక్షులు బందారపు మల్లేశ్‌గౌడ్, బోడ రాధ, బీజేవైఎం అధ్యక్షుడు బోడ బుచ్చిబాబు నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే, ఎంపీ, బార్‌అసోసియేషన్ సభ్యుల వినతి

సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు

చౌటుప్పల్, జూలై 27 : చౌటుప్పల్ మండల కేంద్రంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం వినతిపత్రం అందించారు. అన్ని శాఖల డివిజన్ కార్యాలయాలతో పాటు మున్సిపల్ కేంద్రంగా ఉన్న చౌటుప్పల్‌లో సబ్ కోర్టు ఏర్పాటు చేస్తే ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని వినతిలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కేసుల సంఖ్య కూడా అధికంగానే ఉంటుందని, ఇప్పటికే ప్రభుత్వం కోర్టు కోసం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని వారు గుర్తు చేశారు. దీనికి స్పందించిన సీఎం లా సెక్రటరీకి ఫోన్‌చేసి చౌటుప్పల్‌లో సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఏర్పాటును పరిశీంచాలని ఆదేశించినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు తాడూరి పరమేశ్, కార్యదర్శి రాపోలు వేణు, కోశాధికారి పడమటి మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● కేవీ ప్రిన్సిపాల్ చంద్రమౌళి

కేవీలో వనమహోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

భువనగిర అర్బన్, జూలై 27: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎన్.చంద్రమౌళి అన్నారు. శనివారం కేంద్రీయ విద్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజాపేట హైస్కూల్‌లో

రాజాపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ మిషన్, స్కూల్ న్యూట్రిషన్ డే, ఏకోక్లబ్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుడుగు జానయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్, లేనిన్, శ్రీదేవి, అనిత, కరుణ, పెట్రిషియ, హేమలత, నాగలక్ష్మి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

బోనాలతో తరలి వస్తున్న విద్యార్థులు

చౌటుప్పల్, జూలై 27 : చౌటుప్పల్ పట్టణంలోని త్రినిటీ పాఠశాల విద్యార్థులు శనివారం పట్టణ కేంద్రంలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. చిన్నారులు అమ్మవారు, శివసత్తులు, పోతరాజుల వేశాలతో అలరించారు. అమ్మాయిలు బోనాలను ఎత్తుకొని రహదారిపై ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు తెలిపేందుకే బోనాల ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, గాంధీ గ్లోబల్ సంస్థ మండల ప్రెసిడెంట్ వెన్‌రెడ్డి సంధ్య, కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్ బాబు, అంతటి విజయలక్ష్మి, కాసర్ల మంజుల, బొడిగే అరుణ, రామాలయ అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు నివాళి

అబ్దుల్ కలామ్ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలేరురూరల్, జూలై 27 : మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్‌కలామ్ వర్ధంతిని శనివారం ఆలేరు పట్టణంలో రాఘవ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు పులిపలుపుల మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ధర్నా

ధర్నా చేస్తున్న నాయకులు

బొమ్మలరామారం, జూలై 27 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియా రాజు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ధరావత్ జగన్, నాయకులు వెంకటేశ్, భరత్, శ్రీకాంత్, వేణు, చరణ్, అవినాశ్, శివ, సందీప్, శ్రీధర్, సునీల్, మున్న పాల్గొన్నారు.

బడ్జెట్‌లో యాదాద్రి జిల్లాను విస్మరించిన ప్రభుత్వం

● సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

సమావేశంలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

ఆత్మకూరు(ఎం), జూలై 27 : రాష్ట్ర బడ్జెట్‌లో యాదాద్రి జిల్లాలో ఉన్న సాగునీటి కాల్వలను విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. స్థానిక జేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్లో శనివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. యాదాద్రి జిల్లాలోని బునాదిగాని కాల్వ, పిలాయి పల్లి కాల్వ, బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్లు, మూసీ ప్రక్షాళనకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్రంలోనే గొప్ప ఆలయంగా పేరున్న యాదాద్రి దేవాలయానికి నిధులు కేటాయించక పోవడంతో పనులు ఆగిపోయాయని, దాంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు కేటాయింపజేయాలని, లేని పక్షంలో ప్రజలు క్షమించరని హెచ్చరించారు. మారుపాక వెంకటేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు పాశికంటి లక్ష్మీనరసయ్య, కుసుమాని హరిచంద్ర, మండల కార్యదర్శి జల్లి రాములు, నాయకులు జక్క దయాకర్‌రెడ్డి, మహిళా సంఘం గౌరవాధ్యక్షురాలు గుర్రం రాజమణి, సోలిపురం లింగారెడ్డి, సుల్తాన్ పురుశోత్తం, యాసబుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

చోరీలను అరికట్టేంద